క్లుప్తంగా

అధ్యక్షుడిగా రాము

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఊరకుంట పోచమ్మ బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా దుర్గం రాము ఎన్నికైనట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి పి.మురళీ తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికలో ఉపాధ్యక్షులుగా విక్కీ, చీకూరి శ్రీను, సుంకసారి శివ, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి రాజు, సభ్యులుగా చెన్నకేశవులు, దయాకర్, పండ్ల శ్రీను తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో శ్రావణమాసం చివరి వారంలో బోనాలు నిర్వహించనున్నారు. కౌన్సిలర్లు నందకిశోర్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చండిహోమం

జడ్చర్ల టౌన్: ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని లోకకల్యాణార్థం సోమవారం దేవునిగుట్ట తండా వద్ద ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో చండీహోమం నిర్వహించనున్నట్లు ఆచార్య కృష్ణస్వామి తెలియజేశారు. అనంతరం అన్నదానం ఉంటుందని అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

బాధితుడికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటూ కోలుకుంటున్నాడు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి ఆదివారం ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పెద్దమందడి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేణుయాదవ్, ఎంపీటీసీ గణేష్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

జాతరలో పాల్గొన్న అభివృద్ధి ఫోరం సభ్యులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: భావసార క్షత్రీయ సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబా భవానీ జాతరలో పాలమూరు అభివృద్ధి ఫోరం నాయకులు మున్నూరు రవి, మైత్రి యాదయ్య, విశ్వనాథ్, వెంకటేశ్, రాకేశ్, పాల్గొన్నారు. సమాజం సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొన్నట్లు వివరించారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం



పాలమూరు: కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పూర్వ ఆదరణ లభిస్తోందని, రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ వార్డులతో పాటు, అమిస్తాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబెదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ రాబోయో ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారన్నారు. జిల్లా అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, సీజె బెనహర్, అనిత, లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్ ఖాద్రీ, రాములు, కేశిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను విమర్శించే అర్హతలేదు

బాలానగర్: బీఆర్‌ఎస్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రావు అన్నారు. అనిరుధ్ రెడ్డి చేసిన విమర్శలను తిప్పికొట్టారు. విమర్శలు చేసేముందు అభివృద్ధిని చూడాలన్నారు. వీరన్నపల్లి నుంచి బాలానగర్ వరకు డబుల్ రోడ్డు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బాలానగర్‌లో ప్రభుత్వ భూములు కాంగ్రెస్ అమ్ముకొందని ఆరోపించారు. వైస్ ఎంపీపీ వెంకటచారి, రాజేందర్ ఠాకూర్, జగదీశ్వర్ రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి మంచి జరగాలని..



దేవరకద్ర రూరల్: ఒక్కో గ్రామానికి ఒక్కో ఆచారం ఉంటుంది. ప్రాంతాన్ని బట్టి మనుషులు నమ్మకాలు, ఆచారాలు కొనసాగుతుంటాయి. అలాంటి ఆచారాలలో వనభోజనాలు ఒకటి. గతంలో ఊరికి ఎలాంటి కీడు జరగకుండా ఉండలని చాలా గ్రామాల్లో సంవత్సరానికి ఒకసారి ప్రజలందరూ ఇళ్లకు తాళాలు వేసి పొలిమేర అవతలికి వెళ్లేవారు. గ్రామ దేవతలకు పూజలు చేసి, అక్కడే సామూహికంగా వంటలు చేసుకుని తినేవారు. మండలంలోని హాజిలాపూర్ గ్రామస్తులు ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. ఆదివారం గ్రామాన్ని విడిచి బయటకు వెళ్లారు. ఏటా ఆషాడమాసం చివరలో ఈ కార్యక్రమం ఉంటుందని, అలా వెళ్లే క్రమంలో గ్రామంలో అందరూ కట్టెలు పోగు చేసి మంట పెడతారని పెద్దలు వివరించారు. అనంతరం గ్రామంలోని వడ్రంగులు తయారు చేసిన దేవతామూర్తుల చెక్క విగ్రహలకు పూజలు చేసి పొలిమేరకు తీసుకెళ్లామని వివరించారు. అక్కడే రోజంతా గడిపి సాయంత్రం ఇళ్లకు చేరుకున్నామని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల గ్రామానికి మంచి జరుగుతుందని నమ్ముతామని వివరించారు.

స్థల వివాదం పరిష్కరిస్తాం



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- అంబాభవానీ ఆలయానికి రూ.50లక్షలు
- భావసార క్షత్రీయ కమ్యూనిటీ హాల్‌కు గజాల స్థలం, రూ.20 లక్షలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తా సమీపంలో ఉన్న అంబా భవానీ ఆలయ స్థల వివాద పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అమ్మవారి ఆలయం సమక్షంలో అందరినీ కూర్చోబెట్టి స్థల వివాదాన్ని పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి పేర్కొన్నారు. ఆదివారం ఆలయంలో ఆషాడ పూజ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భావసార క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మేళనంలో మంత్రి ప్రసంగించారు. సమాజం ఆధ్వర్యంలో నిర్మించిన అంబాభవానీ ఆలయం ఎంతో ప్రసిద్ధి పొందిందన్నారు. అమ్మవారి దర్శనం కోసం నిత్యం ఎంతమంది భక్తులు వస్తుంటారని తెలిపారు. ఇంత ప్రముఖమైన ఆలయానికి సంబంధించి స్థల వివాదం ఉండడం విచారించదగ్గ విషయమని, అయినప్పటికీ సమస్య పరిష్కారానికి తన వంతు కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయం నిర్మించేందుకు రూ. 50 లక్షల నిధులు అందిస్తామన్నారు. భావసార క్షత్రియ కమ్యూనిటీ హాల్ కోసం వెయ్యి గజాల స్థలం, రూ.20 లక్షల నిధులు కేటాయించి వారం రోజుల్లో పనులు చేపడతామన్నారు. వందేళ్ల క్రితమే భావసార క్షత్రీయ సమాజానికి చెందిన వారు మహారాష్ట్ర నుంచి వచ్చి జిల్లా కేంద్రంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల స్థిరపడ్డారని ఆయన పేర్కొన్నారు. స్థానికులతో మమేకం అవుతూ ఈ ప్రాంతం అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, సమాజ్ అధ్యక్షుడు సుభాష్, ప్రధాన కార్యదర్శి పండరీనాథ్, దేవాలయం చైర్మన్ గోపీచంద్, ప్రహ్లాద రావు డగే, జమాల్పూర్ రమేష్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

భూత్పూర్: బ్రాహ్మణోత్తముల ఆశీర్వాదంతోనే తాను ప్రతిరోజు ఏదో రూపలో సేవా కార్యక్రమం చేస్తున్నానని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎవరికి ఆపద వచ్చినా, సమస్య ఉన్నా పనిచేసేలా శక్తి సామర్థ్యాలు భగవంతుడు ఇచ్చినందుకు సంతోషంగా ఉందని వివరించారు. మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులను గజమాలతో సత్కరించి పూలాభిషేకం చేశారు. మంత్రి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. మన్యంకొండను మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టినట్లు వివరించారు. మహబూబ్‌నగర్ పట్టణం చుట్టుపక్కల రహదారుల అభివృద్ధి, బైపాస్ నిర్మాణంతో పాటు ఇండ్రస్టీయల్ పార్కు రావడంతో భూముల ధరలు పెరగడంతో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని వివరించారు. రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు డైరెక్టర్ జ్యోషి గోపాల శర్మ, పాలమూరు జిల్లా బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు భీమా చార్యులు, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర శర్మ, కోశాధికారి శ్రీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన బ్రాహ్మణులు

పాత పెన్షన్ సాధనే లక్ష్యం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా పోరాటం చేస్తామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సనాతన బాల స్వామి అన్నారు. ఆదివారం జోగుళాంబ జిల్లా నుంచి ప్రారంభించిన సంకల్ప రథయాత్రకు జిల్లా నుంచి సీపీఎస్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పాత విధానం అమలు చేసేదాక పోరాటం సాగుతుందన్నారు. యాత్ర విజయవంతం అయ్యేందుకు ఆయా శాఖల ఉద్యోగులను కలిసి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఉంటుందని వివరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, కోశాధికారి రాఘవేంద్ర, కృష్ణకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ బి.పార్థసారథి సూచించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని తిమ్మసానిపల్లి తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేయబోయే పోలింగ్ బూత్‌లను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల బీఎల్‌ఓలకు ఫారం 6, 7, 8 కింద వచ్చే వాటన్నింటిని ఏ రోజుకు రోజు పరిష్కరించాలని సూచించారు. ప్రతిదీ క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని అన్నారు. ఓటరు నమోదుపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఫారం-6 ద్వారా ఓటరుగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల పేర్లను తొలగింపునకు ఫారం-7, మార్పులు, చేర్పులకు ఫారం-8 ద్వారా సరిచేసుకోవచ్చని సూచించారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కు వివరాలను ఎపిక్ నంబర్‌తో పరిశీలించుకోవాలని అన్నారు. తహసీల్దార్ వెంట గిర్దావర్ నర్సింగ్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



తిమ్మసానిపల్లిలో ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్థసారథి

ఆలయానికి రూ.50వేలు విరాళం



కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్ సీతరామాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన లక్ష్మణాచారి ఆదివారం రూ.50వేలు విరాళం అందించారు .ఈ సందర్భంగా నిర్వాహకులు అయనును అభినందించారు. దాతలు ముందుకు రావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

చిన్నచింతకుంట: లాల్‌కోట ఊకచెట్టు వాగు నుంచి ఆదివారం తెల్లవారు జామున దేవరకద్ర మండలం బస్వాపురం గ్రామానికి చెందిన రాజు టిప్పరు ద్వారా అక్రమంగా ఇసుకను మహబుబ్‌నగర్‌కు తరలిస్తుండగా పోలీస్‌లు పట్టుకున్నారు. టిప్పరును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శేఖర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

మిడ్జిల్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండుయాదవ్ అన్నారు. ఆదివారం వేములకి చెందిన ఆవుల మల్లేష్‌కు మంజూరైన రూ.2.25 లక్షల చెక్కుల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవతో త్వరగా మంజూరు చేయించినట్లు వివరించారు. వీరారెడ్డి, రాంరెడ్డి, బెట్టరి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

జెడ్పీసెంటర్(మహబూనగర్) : హన్వాడ మండలంలోరి దొర్రి తండాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వారికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ బాలరాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, రమణారెడ్డి, వైస్‌ఎంపీపీ లక్ష్మి, మండలఅధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, సర్పంచ్ ఉషా పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సల్లోనిపల్లి మాజీ సర్పంచ్ జాక్యనాయక్, మరికొందరు నాయకులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఆయన వివరించారు. బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఎంపీపీ బాల్‌రాజ్, జెడ్పీటీసీ విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో..

జడ్చర్ల: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో ఆదివారం జడ్చర్లకు చెందిన ప్రైవేట్ టూరిస్ట్ డ్రైవర్ల అసోసియేషన్ సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హైదారాబాద్‌లో ఎమ్మెల్యేని కలిసి తమ సమస్యలను వారు వివరించారు. కాగా పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

బాలానగర్: మోతీఘణాపూర్ వార్డు సభ్యుడు, గ్రామస్తులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామపెద్దలు ప్రతాప్‌రెడ్డి, యాదగిరి రెడ్డి తదితరులు ఉన్నారు.

రామలింగేశ్వరాలయానికి ఏసీల బహూకరణ



నరేష్‌గౌడ్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఇద్దరు దాతలు రెండు ఏసీలను బహూకరించారు. గ్రామానికి చెందిన గట్టు నరేందర్‌గౌడ్ మైహోంలో సీనియర్ ఇంజనీయర్‌గా పని చేస్తుండగా అతని మిత్రుడు, మైహోం మేనేజర్ శ్రీధర్(హైదరాబాద్)తో కలిసి అమీర్‌పేటలో ఉండే తమ షాపు శ్రీరామలింగేశ్వర టెక్నాలజీ పేరిట రూ.90వేల విలువైన రెండు ఏసీలను ఆలయంలో ఏర్పాటు చేయించారు. దాతను ఆలయ నిర్వాహకులు ఆదివారం సత్కరించారు. ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ, క్లర్క్ సాయిబాబా, పూజారులు మణికంత, రామలింగ శర్మ తదితరులు ఉన్నారు.

వైభవంగా బోనాల పండుగ



లక్ష్మీపల్లిలో బోనాల వేడుక

దేవరకద్ర రూరల్: లక్ష్మీపల్లి గ్రామంలో బోనాల పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. బోనాలను ఊరేగింపుగా గ్రామ దేవతాల వద్దకు తెచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు గ్రామంలోని కనకదుర్గా దేవి దివ్యక్షేత్రంలో అమ్మవారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

బాలానగర్: మన్నెగూడ తండాలో బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేత బాలా త్రిపుర సుందరీ దేవీ పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. నాయకులు, తండా వాసులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండల పరిధిలోని చీకర్లబండ, ముందలితండాల్లో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముందలితండా సర్పంచ్ నీలేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ మండలం మన్నెగూడతండాలో..

వర్షాలు కురవాలని వనభోజనాలు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంతో పాటు వేముల తదితర గ్రామాల్లో వర్షాలు కురవాలని ఆదివారం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయమే ఇళ్లకు తాళాలు వేసి పొలాల వద్దకు వెళ్లారు. అక్కడే వంటలు చేసుకుని వనభోజనాలు చేశారు. సాయంత్రం వరకు చెట్ల కిందనే సేదతీరారు. గ్రామాల్లోకి ఇతరులెవరు వెళ్లకుండా గ్రామసేవకులు పహారా కాశారు. సర్పంచులు శెట్టి అన్నపూర్ణమ్మ, అరుణ, రైతు బంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ శెట్టిశేఖర్, కోఆప్షన్ మదీనా జమీర్ తదితరులు ఉన్నారు.

ఆషాఢమాస పూజలు



నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ దేవాలయంలో ఆషాఢమాస ముగింపు సందర్భంగా ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు, వడిబియ్యం సమర్పించారు. అడవి అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. భక్తుల సౌకర్యార్థం అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, అధికారి మదనేశ్వర్ రెడ్డి తెలిపారు.

సంస్థాగతంగా బలోపేతం కావాలి

అడ్డాకుల: నియోజకవర్గంలో బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎగ్గని నర్సిములు అన్నారు. మండలంలోని కందూర్ రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద ఆదివారం నిర్వహించిన టిఫిన్ డబ్బా ఇష్టాగోష్టి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోసం నేతల మధ్య సమన్వయం, భవిషత్‌లో పార్టీని ముందుకు తీసుకెళ్లే విధానం గురించి చర్చించారు. వచ్చే ఎన్నికల్లో దేవరకద్ర అసెంబ్లీని బీజేపీ దక్కించుకునే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎగ్గని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రెడ్డి, సత్యన్నగౌడ్, మున్నూర్ రమేష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



కోయిల్‌కొండలో నిరసనవ్యక్తం చేస్తున్నకార్మికులు

నవాబుపేట: సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మెబాట పట్టిన పంచాయతీ కార్మికులు ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘం జేఏసీ నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్, రమేష్, నర్సింహ, వెంకటేష్, వెంకటయ్య, బాలయ్య, నర్సింహులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరించిన సర్పంచ్

పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో మండల కేంద్రంలో చెత్త సమస్య తీవ్రంగా మారింది. దీంతో ఆదివారం సర్పంచ్ గోపాల్‌గౌడ్ స్వయంగా పంచాయతీ ట్రాక్టర్ నడుపుతూ వీధుల్లో చెత్త సేకరణ చేశారు. కాగా పంచాయతీ కార్మికులు చెత్త సేకరించ వద్దని తమకు మద్దతు ఇవ్వాలని ఆయనను కోరారు.

కోయిల్‌కొండ: మండలంలో ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి సూర్యం ఆదివారం పంచాయతీ కార్మికుల సమ్మెలో పాల్గొని మాట్లాడారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మెలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ పాల్గొని మాట్లాడారు. జిల్లా కార్యదర్శి కురుమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తిక, దేవదానం, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జడ్చర్లలో కార్మికులు మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. నాయకులు జంగయ్య, కృష్ణ, జనార్దన్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేటలో అర్ధనగ్నంగా..



జడ్చర్లలో మోకాళ్లపై ..



భూత్పూర్‌లో..



నవాబుపేటలో చెత్తను తరలిస్తున్న సర్పంచ్

తిరుమలలో బోయపల్లి బృందం సంకీర్తన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తిరుమలలో ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించిన అఖండ హరినామ సంకీర్తనలో బోయపల్లి (16వ వార్డు) లోని శ్రీ శివ రామాంజనేయ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావం అలవరచు కోవాలన్నారు. తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. సభ్యులు బి.రామచంద్రయ్య, జి.భగవాన్, బి.కృష్ణయ్య, కె.సంజీవయ్య, కె.నర్సింహులు, ఎ.వెంకటయ్య, వి.సత్యనారాయణ, కె.గోవర్ధన్, ఎం.సంజీవ, డి.హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు మూసాపేటలో ధర్నా

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు వద్ద సోమవారం ఉదయం ధర్నా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మూసాపేట, అడ్డాకుల, భూత్పూర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ఆందోళన చేయనున్నట్లు వివరించారు. డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ధర్నాకు హాజరవుతారని తెలిపారు.